'భారతీయులం మేము భారతీయులం' పాట ఆవిష్కరణ

సుభాష్‌నగర్: సూరారం కాలనీ శ్రీవాసుదేవ ఆశ్రమంలో ఆదివారం సాయంత్రం సామాజిక, సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంగరాజు రంగారావు రచించిన భారతీయులం మేము భారతీయులం పాట ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కవి, హాస్య బ్రహ్మ డాక్టర్ శంకరానారాయణ, విశిష్ట అతిథులుగా 'నా ఫౌండేషన్' వ్యవస్థాపకులు గోగులపాటి కృష్ణమోహన్, ప్రముఖ కవయిత్రి, ఆధ్యాత్మిక వ్యాఖ్యాత రంగరాజు పద్మజలు హాజరయ్యారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మనం భారతీయులం కావడమే మన జీవితాలకు గర్వకారణమన్నారు. ఈ విషయంపై రంగరాజు రంగారావు ఒక అద్భుతమైన పాటను రాయడం, దానికి రాయారావు విశ్వేశ్వర్‌రావు స్వరకల్పన చేయడం అభినందనీయమన్నారు. సనాతన భారతీయ ధర్మం గురించి వీనుల విందుగా ఈ పాట ఉండటం విశేషమని పేర్కొన్నారు.

◆ ఒకే ఒక్క పాటలో భారతీయత గొప్పతనం గురించి సుందరంగా పాటను చర్చిదిద్దడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాట రచయిత రంగరాజు రంగారావు, స్వరకల్పన చేసిన రాయారావు విశ్వేశ్వర్ రావు, వీడియో ఎడిటర్ రాయారావు శివాని, సీనియర్ జర్నలిస్ట్ సర్వేపల్లి రమేష్ కుమార్, వాసుదేవ ఆశ్రమం ప్రధాన పూజారి సింహాచలం శ్రీధరాచార్యులు, శివభాస్కర్, రాచపూడి ప్రభాకర్, మంజుల, గీత, మండువ శేషారావు, కోటేశ్వరరావు, హనుమంతరాయ శర్మ, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఓక్రిడ్జ్ విద్యార్థులకు ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల నుంచి ఆఫర్లు


విద్యార్థులు సహర్ష్, ఇషా, పార్థు

దుండిగల్: భౌరంపేట్‌లోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల నుంచి ప్రారంభ ఆఫర్లు అందుకున్నారు. యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్, యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా, వర్జీనియా కామన్‌వెల్త్ యూనివర్సిటీ, డ్రెక్సల్ యూనివర్సిటీ, టెంపుల్ యూనివర్సిటీ, ఓపీ జిందాల్ యూనివర్సిటీలు ఇందులో ఉన్నాయి. పాఠశాలకు చెందిన డీపీ-2 విద్యార్థి ఇషా, సీబీఎస్ఈ-12 చదువుతున్న సహర్ష్, పార్థులు ప్రారంభ ఆఫర్లు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బల్జీత్ ఒబెరాయ్ మాట్లాడుతూ తమ పాఠశాల హైదరాబాద్‌లో 3వ బెస్ట్ ఇంటర్నేషనల్ స్కూల్‌గా నిలిచిందని, తమ విద్యార్థులకు 12 యూనివర్సిటీల నుండి ప్రారంభ ఆఫర్ లెటర్లు రావడం సంతోషంగా ఉందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు.

ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలు


నల్లపోచమ్మ పునః ప్రతిష్ఠాపన పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సూరారం సాయిబాబానగర్‌కు చెందిన శ్రీనల్లపోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమం పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అమ్మవారి చల్లని చూపులు ప్రజలందరిపై ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకట్‌రెడ్డి, కిషన్‌రావు, ఇంద్రారెడ్డి, గజానంద్, పవన్, సూర్యకాంత్, సంతోష్, వెంకట్ రెడ్డి, నాగిరెడ్డి ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత 'కొంపల్లి టీమ్'

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలటీ పరిధిలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో కొంపల్లి టీమ్ విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో దూలపల్లి జట్టుపై కొంపలి విజయం సాధించింది. ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి విజేత జట్టుకు ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు భైరి ప్రశాంత్‌గౌడ్, జయభేరి గోపాల్‌రెడ్డి, పూర్ణచంద్రరావు, దొడ్ల శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, ఎండీ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

◆ భౌరంపేట్ సర్వే నం.578, 580ల్లోని లక్ష్మీనగర్-2, అంబేడ్కర్ నగర్-2 వాసులు సీపీఐ నాయకుడు ఏసురత్నం ఆధ్వర్యంలో కొలన్ హన్మంతరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఎంపీపీగా ఉన్న సమయంలో సదరు సర్వే నంబర్లలో పేదలకు పట్టాలు అందజేయగా నిర్మించిన ఇళ్లను గత ప్రభుత్వంగా కూల్చేశారని అన్నారు. న్యాయం చేయాలని కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హన్మంతరెడ్డి హామీ ఇచ్చారు.

ప్రసూననగర్ అధ్యక్షుడిగా రాంచందర్



కుత్బుల్లాపూర్: ప్రసూననగర్ కాలనీ వెల్ఫేర్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా ముప్పిడి రాంచందర్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో సమీప ప్రత్యర్థి మాజీ అధ్యక్షుడు రమేష్‌పై 4 ఓట్ల ఆధిక్యంతో రాంచందర్ విజయం సాధించారు. అదే విధంగా ప్రధాన కార్యదర్శిగా బరిలో దిగిన సిద్దుగౌడ్ సమీప ప్రత్యర్థి గోపాల్‌రెడ్డిపై 8 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కాలనీవాసుల సహకారంతో ప్రసూననగర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని రాంచందర్ పేర్కొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

కుత్బుల్లాపూర్: మంచి విద్యనందించడంతో పాటు భావిభారత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దినప్పుడే పాఠశాలలకు గుర్తింపు లభిస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. గాజులరామారం కైసర్‌నగర్‌లోని సాధన ప్రతిభా స్కూల్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పున్నారెడ్డి, పాఠశాల యాజమాన్యం ప్రవీణ్, కవితరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం విద్యతో పాటు ఆట పాటల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పోత్సాహక బహుమతులు అందజేశారు.



నిర్వహణ గాలికి.. మరుగుదొడ్లు దేనికీ?

- మూలనపడ్డ పబ్లిక్ టాయిలెట్స్
- వినియోగంలోకి తేని సంబంధిత అధికారులు


గురుమూర్తినగర్ రోడ్డులో టాయిలెట్లు ఇలా..


కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయ ఎంట్రన్స్ పక్కనే నిరుపయోగంగా ఇలా..


హెచ్‌ఎంటీ రోడ్డులోని జీడిమెట్ల పీఎస్ ఎదురుగా..


ఐడీపీఎల్- జగద్గిరిగుట్ట రోడ్డులోని గిరినగర్ ఆర్చ్ వద్ద స్క్రాప్‌గా మారిన షీ టాయిలెట్


ఐడీపీఎల్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై టాయిలెట్లు ఉన్నా, నీళ్లు ఉండవు

రంగారెడ్డినగర్: స్వచ్ఛ హైదరాబాద్‌లో భాగంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛ మరుగుదొడ్ల నిర్వహణ కొరవడటంతో అధ్వానంగా మారాయి. బహిరంగ మలమూత్ర విసర్జన నిర్మూలించే దిశగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని పలు డివిజన్ల ప్రధాన రహదారులు, కూడళ్లు, కార్యాలయాల సమీపంలో లక్షలాది నిధులు వెచ్చించి వీటిని ఏర్పాటు చేశారు. అయితే ఆరంభంతో వీటి నిర్వహణ విషయంలో పట్టించుకున్న అధికారులు ఆపై నిర్వహణను గాలికొదిలేశారు.

◆ సదరు టాయిలెట్ల నిర్వహణ కాంట్రాక్ట్‌ను దక్కించుకున్న ప్రైవేట్ ఏజెన్సీలు టాయిలెట్లను శుభ్రం చేయకపోగా టాయిలెట్లకు ఉన్న ట్యాంక్‌లలో నీటిని సైతం నింపడం లేదు. దీంతో చాలా ప్రాంతాల్లో టాయిలెట్లు నిరుపయోగంగా మారాయి. అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు, పాదాచారులు టాయిలెట్లు నిర్వహణ కొరడటంతో పక్కనే మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో బహిరంగ మలమూత్ర విసర్జన నిర్మూలన కార్యక్రమం అటకెక్కిందనే చెప్పవచ్చు.

◆ చింతల్ హెచ్‌ఎంటీ రోడ్డు నుంచి షాపూర్ నగర్ వరకు ఉన్న టాయిలెట్లు, కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయానికి ఆనుకున్న టాయిలెట్‌లలో నీటి సదుపాయం ఉండటం లేదు. అదే విధంగా ఐడీపీఎల్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై, ఏపీహెచ్‌బీ కాలనీ జలమండలి కార్యాలయం సమీపంలో, గురుమూర్తినగర్ రోడ్డులో ఉన్న టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉండటంతో పక్కనే మూత్ర విసర్జన చేస్తున్నారు.

◆ ఇక గిరినగర్ ఆర్చ్ పక్కనే గత రెండు సంవత్సరాలుగా ఫ్రీ టాయిలెట్ ఉన్నా నిర్వహణ లోపించడంతో స్క్రాప్‌ను తలపిస్తోంది. ఇలా కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఏర్పాటు చేసిన వందలాది టాయిలెట్లు అధికారుల పర్యవేక్షణ లోపం, ప్రైవేట్ ఏజెన్సీల నిర్లక్ష్యం కారణంగా అక్కరకు రాకుండా పోతున్నాయి.

మహిళలకు ఇబ్బందులు..

వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగించే మహిళా ప్రయాణికులకు టాయిలెట్లు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్రీ టాయిలెట్లలో నీళ్లు లేకపోవడం, అపరిశుభ్రంగా ఉండటంతో వాటిని వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. స్వచ్ఛ హైదరాబాద్ అధికారుల ప్రకటనలకే పరిమితమవుతోందని మహిళలు పెదవి విరుస్తున్నారు.

మేడ్చల్ వరకు మెట్రో రైలు సదుపాయాన్ని కల్పించాలి


సుచిత్ర సర్కిల్ జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు

కుత్బుల్లాపూర్: సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి సుచిత్ర, కొంపల్లిల మీదుగా మేడ్చల్ వరకు మెట్రో రైలు సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని ఆదివారం సుచిత్ర సర్కిల్‌లోని జాతీయ రహదారిపై మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. వారికి సంఘీభావం తెలిపిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి మాట్లాడారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కొంపల్లి, సుచిత్ర, పేట్‌బషీరాబాద్, మేడ్చల్ ప్రాంతాల్లో అనేక విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ, బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లలో జనాభా పెరిగిందన్నారు. దీంతో నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెట్రో రైలును మేడ్చల్ వరకు పొడిగిస్తే రాకపోకలు సులభంగా మారుతాయని పేర్కొన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సంపత్ రెడ్డి, రాజారెడ్డి, మహేందర్‌రెడ్డి, జార్జ్, అరవింద్‌రావు, కృష్ణారెడ్డి, ఉదయశంకర్, కిషన్ రెడ్డి, సుబ్బా రావు, శేఖర్‌రెడ్డి, పెద్దిరెడ్డి, రాకేష్, శ్రీధర్, కిషన్, సురేష్, ఉదయ్ గుప్తా, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం తొలి ప్రాధాన్యం


జర్నలిస్ట్‌కాలనీలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ప్రాధాన్యనిస్తూ ఆ దిశగా పని చేస్తోందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ జర్నలిస్ట్ కాలనీలో నెలకొన్న సమస్యలపై ఆదివారం సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన హన్మంతరెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని విమర్శించారు. అపరిష్కృతంగా ఉన్న వాటిని పరిష్కరించే దిశగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జర్నలిస్ట్ కాలనీలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ ప్రెసిడెంట్ కొలన్ రాజశేఖర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఇందిర, నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, గంగాధర్, కృష్ణంరాజు, రామచంద్ర నాయక్, పితాని శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి


భాగ్యలక్ష్మికాలనీ నేతాజీ హైస్కూల్ సమీపంలో పారుతున్న మురుగు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గ్రామం నుంచి సుచిత్ర వెళ్లే రోడ్డులోని భాగ్యలక్ష్మికాలనీ నేతాజీ హైస్కూల్ మూలమలుపు వద్ద నిత్యం డ్రైనేజీ పొంగి పొర్లుతుంది. వివిధ విభాగాల అధికారులు ఇటు వైపుగా రాకపోకలు సాగిస్తున్నప్పటికీ స్థానికంగా ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.గతంలో ఇక్కడ రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేపట్టిన డ్రైనేజీ సమస్య పరిష్కారానికి మాత్రం మార్గం చూపలేదు.దీంతో ప్రతిరోజు ఉదయం సాయంత్రం వేళల్లో ప్రధాన రోడ్డుపై డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతూ వాహనాలు వెళ్తున్న క్రమంలో పాదాచారులపై పడుతున్నాయి.ఇప్పటికైనా సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

అంగరంగ వైభవం వేణుగోపాలాస్వామి బ్రహ్మోత్సవం


హనుమత్ వాహనంపై ఊరేగుతున్న వేణుగోపాలాస్వామి


స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న భక్తజనం

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గ్రామంలోని వేణుగోపాలాస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం రాత్రి స్వామి వారిని హనుమత్ వాహనంపై పుర వీధుల్లో ఊరేగించగా భక్త జనం మంగళ హారతులు పట్టారు. దారి పొడవునా టెంకాయలు కొట్టి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి 9గంటలకు స్వామివారికి ఎదుర్కోల కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం పవళింపు సేవ నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఠాకూర్ రాజేందర్ సింగ్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

బిజినెస్ వర్క్‌షాప్

మాదాపూర్: తెలుగు రాష్ట్రాలకు చెందిన ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఫ్రీబిల్డ్ బిజినెస్‌లు, కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాల పేరిట మాదాపూర్‌లోని వెస్ట్‌సైడ్ హోటల్‌లో ఆదివారం బిజినెస్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. బిజినెస్ మెంటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే విధంగా ఏ పరిశ్రమ ముందుకు వచ్చినా ముద్ర వంటి లోన్స్ ద్వారా కేంద్రప్రభుత్వ ప్రోత్సాహకాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

ఆలయ అష్టమ వార్షికోత్సవం

కుత్బుల్లాపూర్: సూరారం శివాలయనగర్‌లోని శ్రీ ముత్యాలమ్మ ఆలయ అష్టమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి జరిగిన అభిషేకాలు, కుంకుమార్చనల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సూరారం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


అమ్మవారిని దర్శించుకున్న పుప్పాల భాస్కర్

భిక్షాటన వయా యూపీఐ

చిల్లర లేదా అయితే ఆన్‌లైన్ చెయ్!


భిక్షాటన చేస్తున్న హిజ్రాకు స్కాన్ చేసి భిక్ష వేస్తున్న ఓ వాహనదారుడు

కుత్బుల్లాపూర్: మారుతున్న కాలానికి అనుగుణంగా తాము మారాలని అనుకున్నారో..! ఏమో..!! ప్రధాన రోడ్లపై నిత్యం మనకు భిక్షాటన చేసే వారితో పాటు హిజ్రాల సైతం వచ్చి తమకు తోచిన విధంగా సహాయం చేయాలని కోరుతుండటం చూస్తుంటాం.. ఆన్‌లైన్ బ్యాంకు లావాదేవీలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో జేబులో చిల్లర డబ్బులు లేకపోవడం మూలంగా పలువురు డబ్బులు ఇవ్వడంలో వెనుకంజ వేస్తున్నారని గుర్తించారో ఏమో..!! షాపూర్‌నగర్ ప్రధాన చౌరస్తా వద్ద ఓ హిజ్రా యూపీఐ స్కానర్లు పెట్టుకుని హైటెక్ పద్ధతిలో భిక్షాటన చేయడం అందర్ని ఆకట్టుకుంది. పలువురు స్కానర్‌లో స్కాన్ చేసి డబ్బులు చెల్లిస్తుండగా సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి


బీఆర్ఎస్ నేత కొలన్ గోపాల్‌రెడ్డిని కలిసిన ఇందిరమ్మకాలనీ ఫేజ్-2 వాసులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2 కాలనీవాసులు ఆదివారం బీఆర్ఎస్ సీనియర్ నేత కొలన్ గోపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాల తదితర సమస్యలను దృష్టికి తీసుకువెళ్లగా మేయర్ నీలారెడ్డికి సమస్యను వివరించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ నాయకులు వెంకటేష్, మురళి, శ్రీనివాస్, గణేష్, చంద్రమౌళి, మల్లేష్ యాదవ్, రమణ, దానరాజు లు ఉన్నారు.

ఉత్సాహంగా మారథాన్ రన్

సాక్షి, సిటీబ్యూరో: మియాపూర్‌లోని ఎస్ఎంఆర్ వినయ్ సిటీ గేటెడ్ కమ్యూనిటీలో ఆదివారం ఉదయం 3కె, 5కె మారథాన్ రన్ ఉత్సాహ భరితంగా సాగింది. ప్రముఖ మారథాన్ రన్నర్ లీనా రాయ్ నేతృత్వంలో జరిగిన ఈ మారథాన్ రన్‌లో దాదాపు నాలుగు వందల మంది వరకు పాల్గొన్నారు. నాలుగేళ్ల చిన్నారి నుంచి 82 ఏళ్ల వృద్ధుడు ఈ మారథాన్‌లో పాల్గొనడం విశేషం. ఉదయం ఆరు గంటలకే ఆరంభమైన కార్యక్రమంలో ప్రముఖ జుంబా ట్రైనర్ అనితా కౌశిక్ వార్మప్ సెషన్‌ను నిర్వహించారు. ఆ తర్వాత ఎస్ఎంఆర్ వినయ్ సిటీ ప్రెసిడెంట్ కె. జాన్సన్ జెండా ఊపి మారథాన్‌ను ఆరంభించారు.

కృష్ణ ఏదులకు డాక్టరేట్

రాయదుర్గం: సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) మాజీ సెక్రటరీ జనరల్ కృష్ణ ఏదులకు మానవత్వంలో డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. అమెరికాలోని జార్జ్ వాషింగ్టన్ యూనివర్శిటీ ఆఫ్ పీస్ ఫ్లోరిడా డాక్టరేట్‌తో సత్కరించారు. కృష్ణ ఏదుల ప్రస్తుతం అసోచామ్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కి సీఎస్ఆర్, సస్టేనబిలిటీ చాప్టర్‌కు కో చైర్‌గా ఉన్నారు.

మళ్లీ మోదీయే ప్రధాని

- బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్
- విజయ్ సంకల్ప్ యాత్రకు కార్యకర్తల ఘన స్వాగతం
- కొంపల్లి నుంచి జగద్గిరిగుట్ట వరకు సాగిన భారీ రోడ్ షో
- పాల్గొన్న ఎమ్మెల్యే పైడి రాజేష్‌రెడ్డి, జాతీయ నేత మురళీధర్‌రావు


జగద్గిరిగుట్టలో జరిగిన విజయ సంకల్పయాత్ర సభలో పాల్గొన్న అశేష జనం

కుత్బుల్లాపూర్: భారతీయులు నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిగా చూడాలనుకుంటున్నారని... వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం చేపట్టిన విజయ్ సంకల్ప యాత్ర ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గుండా కొనసాగింది.

◆ ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు కొంపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించి యాత్ర చేపట్టిన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాజేష్‌రెడ్డి, జాతీయ నాయకుడు మురళీధర్‌రావుకు స్వాగతం పలికారు. కొంపల్లి నుంచి ప్రారంభమైన ఈ యాత్ర సుచిత్ర, జీడిమెట్ల, ఐడీపీఎల్ మీదుగా కొనసాగి జగద్గిరిగుట్టలో జరిగిన భారీ రోడ్ షోతో ముగిసింది.

◆ ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. కులాల పేరుతో కొన్ని రాజకీయ పార్టీలు దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్ర పన్నుతున్నాయని అన్నారు. భారత్ జోడో యాత్ర చేపట్టిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దేశం పాకిస్తాన్, భారత్‌లుగా ఎందుకు విడిపోయిందో ముందుగా జవాబు చెప్పాలన్నారు. ప్రతిపక్షపార్టీలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా 2024లో కేంద్రంలో ఏర్పడబోయేది బీజేపీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు.

◆ శ్రీరామచంద్రుడి ఆశీస్సులతో 400 పైచిలుకు లోక్‌సభ సీట్లను సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ అత్యధిక మెజార్టీతో కైవసం చేసుకుంటుందని అన్నారు. దేశాన్ని ప్రగతి బాటలో నడిపిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని భారతీయులు మళ్లీ కోరుకుంటున్నారని అన్నారు.

◆ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు బీజేపీ విజయానికి కృషి చేయాలన్నారు. ఈ యాత్రలో మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.


విజయ సంకల్ప యాత్ర సభలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

కొంపల్లి నుంచి భారీ బైక్ ర్యాలీ

